క్లుప్తంగా

పడమటి అంజన్నకు ప్రత్యేక పూజలు



ఊట్కూర్: ఊట్కూర్‌లోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆదిత్య పరాశ్రీ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాధకృష్ణయ్యగౌడ్, పుణ్యవతి శేషప్ప, వార్డుమెంబర్ నర్సింహరాజు, వెంకటేశ్, రఘువీర్ ఉన్నారు.

నేడు జీలుగు విత్తనాల పంపిణీ

మాగనూర్: మండల కేంద్రంలోని రైతుఆగ్రోస్ కేంద్రంలో ఆదివారం జీలుగు విత్తనాల పంపిణీ చేస్తామని ఏఈఓ హరీశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు

కోస్గి: ప్రభుత్వ నిబంధనల మేరకు తేమశాతం, తాలు గింజలు ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ ప్రతినిధులు చల్ల శ్రీరాములు, సంతోష్ కుమార్ అన్నారు. ధాన్యాన్ని ఎండబెట్టకుండా నేరుగా తీసుకువస్తే అటు రైతులకు, ఇటు మిల్లర్లకు నష్టమేనని చెప్పారు. రైతులు తెచ్చిన ధాన్యం పచ్చిగా ఉండటంతోపాటు తాలు గింజలు అధికంగా ఉంటున్నాయని అన్నారు. ఈ ఏడాది రైతులు ప్రైవేట్ కంపెనీల వరి విత్తనాలు నాటుకోవడంతోనే తాలు సమస్య అధికంగా ఉందన్నారు. ప్రభుత్వం అందించే 1010 గాని, ఆర్ఎన్ఆర్ విత్తనాలు గాని విత్తుకోవడం వల్ల ధాన్యం సక్రమంగా వస్తుందన్నారు. మిల్లర్లను ఇబ్బంది పెట్టకుండా రైతులు తమ ధాన్యాన్ని ఎండబెట్టుకుని తీసుకురావాలని సూచించారు.

కార్యదర్శుల పోస్టులకు 216 దరఖాస్తులు

మద్దూరు: అవుట్ సోర్సింగ్ విధానంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల నియామకానికి శనివారం అధికారులు దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. మండలంలోని 40 పంచాయతీల నుంచి 216 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీఓ ఉదయ్‌శంకర్ తెలిపారు. ప్రస్తుతం సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు విధుల్లోకి చేరలేదని పేర్కొన్నారు. దరఖాస్తులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవహరిస్తామని తెలిపారు.

విద్యార్థులకు సన్మానం



మక్తల్: మక్తల్ పట్టణంలోని అక్షర ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతిలో ఉత్తమ గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులు శ్రీనిధిజోసి, నవదీప్, సాగర్, జయన్, నవీన్‌ను ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి శనివారం తన నివాసంలో అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాఘవేందర్‌రెడ్డి, ధర్మరాజు, ప్రిన్సిపాల్ రమేష్ ఉన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

మరికల్: ఈనెల 15వ తేదీలోపు చీఫ్ మినిస్టర్ కప్ క్రీడలకు క్రీడాకారులు తమపేర్లను పంచాయతీ కార్యాలయాల్లో నమోదు చేసుకోవాలని కార్యదర్శి శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 15 నుంచి 36 సంవత్సరాలలోపు వారు అర్హులని పేర్కొన్నారు.

గ్రామ కార్యదర్శి పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ధన్వాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సద్గుణ పేర్కొన్నారు. గ్రామంలో స్థానికులు అయినవారు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, కంప్యూటర్‌పై అవగాహన ఉండాలని తెలిపారు. ఆధార్‌కార్డుతోపాటు ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్లు దరఖాస్తుకు జతచేసి, మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్వ: మండలంలోని లంకాల్, యాంకి గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను శనివారం బీజేపీ రాష్ట్ర నాయకులు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి పరామర్శించారు. యాంకి గ్రామ సర్పంచ్ వెంకటేష్ ఇటీవల గుండెపోటుతో మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పెద్దింటి ఆంజనేయులు, అయ్యన్న, గ్రామస్తులు ఉన్నారు.

రాయితీ అందేనా?

- సబ్సిడీ పథకాలను ఒక్కొక్కటిగా అటకెక్కిస్తున్న ప్రభుత్వం
- వ్యవసాయ పరికరాలు కొనలేక ఇబ్బందులు
- ఆర్థికభారంతో సతమతం



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతన్న (ఫైల్)

మాగనూర్: ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలు రైతులకు ఒక్కొక్కటిగా దూరమవుతున్నాయి. వ్యవసాయానికి సాంకేతికత, యాంత్రీకరణ తోడైన నేపథ్యంలో రైతులు పలురకాల వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కానీ ప్రభుత్వం సబ్సిడీ ఎత్తివేయడంతో పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించి కొనుగోలు చేసే స్థోమత లేక గ్రామీణ రైతులు ఇబ్బందిపడుతున్నారు. ఉమ్మడి(మాగనూర్, క్రిష్ణ)మండలంలో 29 గ్రామ పంచాయతీల్లో 17,200 మంది రైతులు ఉన్నారు. గతంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే రోటోవేటర్, కల్టివేటర్, తైవాన్ స్ప్రేల్, మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్లు, నాగళ్లు వంటి పనిముట్లను రైతులకు రాయితీపై అందించేది. కానీ ప్రస్తుతం సదరు రాయితీ పథకం రైతులకు అందని ద్రాక్షగా మారింది.

ఒక్కొక్కటిగా అటకెక్కుతున్న వైనం..

వ్యవసాయశాఖ రాయితీ పథకాలు 2006–07 ఆర్థిక సంవత్సరం నుంచి ఒక్కొక్కటిగా నిలిపివేస్తున్నారు. సేద్యంలో రైతులకు ఎక్కువగా ఉపయోగపడే నాగలి, ఇతర పనిముట్లు 2014వ సంవత్సరం నుంచి నిలిపివేశారు. దీంతో పొలాలను దున్నేందుకు ఇబ్బందిపడుతున్నామని పత్తి రైతులు కొందరు తెలిపారు. 2016–17 వరకు అందుబాటులో ఉన్న 10 నుంచి 12రకాల పనుముట్లు ఆ తర్వాత సగానికి పడిపోయాయి. ఓవైపు యాంత్రీకరణ రాయితీ పథకాలు ఒక్కొక్కటి గా నిలిపోతుండా మరోపక్క మంజూరయ్యే యూనిట్లు కూడా నామమాత్రంగానే ఉంటున్నాయి. తైవాన్ స్ప్రేయర్లకు మంగళం పాడిన వ్యవసాయశాఖ, వాటి స్థానంలో గతేడాది రీచార్జీ స్ప్రేయర్ మంజూరు చేశారు. ప్రస్తుతం రైతులకు నిత్యావసరంగా మారిన టార్పాలిన్లు కూడా సరిపడా మంజూరవడం లేదు. కల్టివేటర్లు, రోటవేటర్ల జాడ లేకుండాపోయింది. గతంలో మాదిరి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని యథావిధిగా అమలుచేసి తమ ఇబ్బందులను దూరం చేయాలని మండలంలోని ఆయాగ్రామాల రైతులు కోరుతున్నారు.

సబ్సిడీపై అందించాలి..



ప్రభుత్వం మూడేళ్లుగా సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించడం లేదు. దీంతో పూర్తి ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ధర అధికంగా ఉండటంతో పాటు నాణ్యత లేక మోసపోతున్నాం. ప్రభుత్వం గతంలో మాదిరి సబ్సిడీపై పనుముట్లు అందిస్తే రైతులకు ఆసరగా ఉంటుంది.

– రాంచందర్‌రెడ్డి, రైతు, వర్కూర్

అకాలవర్షాలతో ఇబ్బందులు..



ప్రభుత్వం గతంలో ప్రతి సంవత్సరం సబ్సిడీపై రైతులకు టార్పాలిన్లు సరఫరా చేయడం ద్వారా పంట ఉత్పత్తులు ఆరబెట్టుకోవడానికి అనువుగా ఉండేది. అయితే ప్రస్తుతం అందించకపోవడంతో బయట కిరాయి భరించలేక తీవ్ర ఇబ్బందులుపడుతున్నాం. అధికారులు స్పందించి సబ్సిడీ పనిముట్లు అందించేలా చూడాలి.

– కిష్టప్ప, రైతు, వడ్వాట్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



సబ్సిడీపై పనిముట్లు, యంత్రాల కోసం రైతులు కార్యాలయానికి వస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రైతులకు ఉపయోగపడే యూనిట్లు మాత్రం మళ్లీ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. కొన్ని పరికరాలు నామమాత్రంగా మంజూరు అవడంతో చాలామంది రైతులకు అందడం లేదు.

– హరిత, ఏఓ, మాగనూర్

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ



ప్రభుత్వ చిన్నపిల్లల ఆస్పత్రిలో బ్రెడ్డు అందిస్తున్న లయన్స్ సభ్యులు

నారాయణపేట టౌన్: మున్సిపల్ వైస్ చైర్మన్, లయన్స్ క్లబ్ గవర్నర్ హరినారాయణ్‌భట్టడ్ 64వ జన్మదిన వేడుకలను శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని పిల్లల వార్డులో అన్నదానం చేశారు. పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అలాగే క్రీడాకారులకు, ఆర్మీ కోచింగ్, వాలీబాల్ కోచింగ్ క్రీడాకారులకు పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జనార్దన్, కోశాధికారి రవిగౌడ్ మాట్లాడుతూ సమాజంలో పేదలకు సేవతో పాటు వృద్ధులకు, విద్యార్థులకు సేవలు అందించేందుకు ముందుండే వ్యక్తి హరినారాయణ్‌భట్టడ్ అని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ లాహోటి, భీంచందర్‌గౌడ్, కన్న జగదీశ్, సత్యనారాయణ, సరాఫ్ నాగరాజ్, అమరేశ్, బస్వరాజ్, బాలాజీ, సదానంద్‌చారి, కృష్ణమూర్తి ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు



కిరణ్‌కుమార్‌రెడ్డి

కోస్గి: పదో తరగతి ఫెయిల్ అయిన ఓ విద్యార్థి అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితులు, ఎస్సై శ్రీనివాసులు కథనం ప్రకారం... మున్సిపల్ విలీన గ్రామం పోలిరెడ్డిపల్లికి చెందిన వెంకట్రామిరెడ్డి కొడుకు కిరణ్‌కుమార్‌రెడ్డి పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 12న తన మేనత్త ఊరికి వెళ్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడం, మేనత్త ఊరికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ సంఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ చంద్రయ్య, గ్రామస్తులు

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గ్రామంలో శనివారం సీసీరోడ్డు పనులను సర్పంచ్ చంద్రకళ ప్రారంభించారు. బీసీ కాలనీలో గ్రామ పంచాయతీ నిధులు నుంచి రూ.10 లక్షలు వెచ్చించి ఈ పనులు చేయిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీమ్‌రెడ్డి, భగవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల గ్రామం నుంచి యంనోనిపల్లి గ్రామం వరకు రీ బీటీ పనులను శనివారం అధికారులు ప్రారంభించారు. రూ.28 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఏఈ ప్రవీణ్‌కుమార్, గున్ముక్ల గ్రామ సర్పంచ్ చంద్రయ్య పనులను పరిశీలించి, నాణ్యతగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాసులు, సచిన్, నాగిరెడ్డి, విజయ్‌కుమార్, రవికుమార్ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

మక్తల్: బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మక్తల్ మండలం చిన్న గోప్లాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లక్ష్మణ్ (50) వ్యవసాయ పనులను ముగించుకుని బావిలో ఈతకు వెళ్లాడు. నీటిలో మునిగి మృతి చెందాడు. లక్ష్మణ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. బావి వద్ద దుస్తులు గుర్తించి స్థానికుల సాయంతో వెతికించగా మృతదేహం లభించింది. మూర్ఛరోగం ఉండటం వల్లే చనిపోయి ఉంటాడని గ్రామస్తులు తెలిపారు. మృత్యుడికి భార్య పార్వతమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు.

రహెమానియ మసీద్ కమిటీ రద్దు

అమరచింత: పట్టణంలోని రహెమానియ మసీద్ కమిటీ రద్దు చేసినట్లు కమిటీ అడ్వయిజర్ షంషీర్, గౌస్ తెలిపారు. అధ్యక్షుడిగా ఉన్న నిసార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంతో మసీద్ నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. మసీద్ నిర్మాణానికి కొత్తగా వసూలు చేసిన డబ్బులు, వాటి ఖర్చు వివరాలను తెలపడం లేదన్నారు. రంజాన్ మాసంలో మసీద్ నిర్వహణ భారంగా మారిందన్నారు. కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు అధ్యక్షుడిని తొలగించినట్లు ప్రకటించారు.

కోటకొండకు మండలంగా అన్ని అర్హతలు



నిరసన తెలుపుతున్న కోటకొండ సాధన సమితి నాయకులు

నారాయణపేట టౌన్: అన్ని అర్హతలు ఉన్న కోటకొండని మండలంగా ప్రభుత్వం ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సాగర్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కోటకొండలో మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 4వ రోజుకు చేరాయి. ఆయన మాట్లాడుతూ గ్రామం చుట్టూ దాదాపు 10 నుంచి 15 గ్రామాల ప్రజలు వచ్చి పోతుంటారని, ఇలాంటి గ్రామం 50 ఏళ్ల కిందటే మండలం కావాల్సి ఉన్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రజల సౌకర్యం కోసం మండల కేంద్రంగా వెంటనే ప్రకటించాలని కోరారు. మండలం సాధించుకుని ఈ దీక్షా శిబిరంలోనే విజయోత్సవ సభ చేసుకునే దాకా ఈ ఆందోళన కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాము, వెంకట్రామిరెడ్డి, గోపాల్, బాల్‌రాం, కాశప్ప, బాలకృష్ణ, నరేష్, సాయిబాబా, సలీం, మోహన్, మన్యం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్మిట్కల్ ఎమ్మెల్యేకు సన్మానం



శరణగౌడను సన్మానిస్తున్నా బీఆర్ఎస్ నాయకులు

కృష్ణా: మండల సరిహద్దులోని గుర్మిట్కల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా జేడీఎస్ పార్టీకి చెందిన కందుకూర్ శరణగౌడ శనివారం కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు శరణగౌడను గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ మండల నాయకుడు శివరాజ్‌పాటిల్ మాట్లాడుతూ వారం రోజులుగా బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గుర్మిట్‌కల్ నియోజకవర్గంలో అవిశ్రాంతంగా ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. వారి గెలుపునకు కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివప్ప, శంక్రప్పగౌడ, వెంకటేష్, జిందప్ప తదితరులు ఉన్నారు.

రైతుల ఖాతాల్లో డబ్బు జమ



మాట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

నర్వ: మండలంలోని పీఏసీఎస్ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను ఆయా రైతుల ఖాతాల్లో మొత్తం రూ.1.09 లక్షలు జమ చేశామని పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో రైతులతో మాట్లాడారు. 827మంది రైతుల నుంచి లక్షా 70వేల విలువ చేసే ధాన్యం కొనుగోలు చేశామని, ఇందులో 115 మంది రైతులకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేశామని అన్నారు. ఇంకా వరి కోసేవారు 30శాతం వరకు ఉన్నారని, వారి ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని అన్నారు. సమావేశంలో సీఈఓ ఉదయ్‌కుమార్, ఇతర సిబ్బంది, రైతులున్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



మక్తల్‌లో ధర్నా పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

మక్తల్: మక్తల్‌లో ఈనెల 15న సోమవారం ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నా పోస్టర్‌ను నాయకులు శనివారం విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చడానికి ఇథనాల్ కంపెనీలకు అనుమతులు ఇస్తున్నదని అన్నారు. ప్రజాభిప్రాయం లేకుండా, గ్రామ పంచాయతీల అనుమతి లేకుండా కంపెనీలను ఏర్పాటు చేయడం వల్ల ఈప్రాంతం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. చిత్తనూరులో కంపెనీ ఏర్పాటు విషయమై ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జీర్గాల్‌నాగేష్, ఆంజనేయులు, మోతీలాల్, ఆర్ శ్రీనివాసులు, విజయ్‌కుమార్, డి.చంద్రశేకర్ లింగన్న, నారాయణ ఉన్నారు.

ధన్వాడ: ధన్వాడలో నిర్వహించిన కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక సభ్యులు పాల్గొన్నారు. పోస్టర్ విడుదల అనంతరం మాట్లాడుతూ మక్తల్‌లో ధర్నాను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వెంకట్రాములు, సుదర్శన్, లక్ష్మణ్, రాజు, మధు పాల్గొన్నారు.

ఊట్కూర్: చిత్తనూర్, హిందూపూర్‌లో ఇథనాల్ కెమికల్ ఫ్యాక్టరీల ఏర్పాటును వెంటనే రద్దుచేయాలని కోరుతూ శనివారం ఊట్కూర్‌లో ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో చలో మక్తల్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ బండారి లక్ష్మయ్య మాట్లాడారు. మరికల్ మండలంలోని చిత్తనూర్, కృష్ణా మండలంలోని హిందూపూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, వాటి ద్వారా రామన్‌పాడు ప్రాజెక్ట్, జూరాల ప్రాజెక్ట్, కృష్ణానది కలుషితం అవుతాయని అన్నారు. ఫ్యాక్టరీలు వదిలే వ్యర్థాలు భూమిలో ఇంకిపోయి భూగర్భజలాలు కలుషితం అవుతాయని, కంపెనీ వదిలే కర్బనఉద్గారాల వల్ల వాతావరణం కలుషితమవుతుందని అన్నారు. ఈ విషయమై 15న మక్తల్‌లో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.లక్ష్మయ్య, బొక్కి కృష్ణ, కతలయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని బాలుడు మృతి



ధృవతేజ మృతదేహం

మరికల్: ఇంటి ముందున్న బాలుడిని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మరికల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు.. దేవరకద్ర మండల బస్వాయపల్లికి చెందిన స్వాతి వేసవిసెలవులు ఉండటంతో ఈనెల 11న మరికల్‌లోని అశోక్‌నగర్ కాలనీలో ఉంటున్న తన అక్క మొగులమ్మ వద్దకు పిల్లలతో వచ్చింది. శనివారం బాలుడు ధృవతేజ(4) ఇంటి ఎదుట ఉండగా డ్రైవర్ సురేష్ నిర్లక్ష్యంగా కారు నడుపుకుంటూ వచ్చి బాలుడిని ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు



నారాయణపేటలో సంబరాల్లో మాట్లాడుతున్న శివకుమార్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయోత్సవ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు తీసి, బాణసంచా పేల్చారు. మిఠాయిలు తినిపించుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. వీరసావర్కర్ చౌరస్తాలో నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి మిఠాయిలు తినిపించి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనలో మార్పుకోసం కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం శుభసూచకమని అన్నారు. త్వరలోనే దేశ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తాయన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సదాశివారెడ్డి, సుధాకర్, ఎండీ గౌస్, కోట్ల రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ ఎం.డి సలీం, మహిమూద్ ఖురేషి, రహమాన్‌చాంద్, బోయ రమేశ్, కళ్యాణ్, యూసుప్‌తాజ్, సీతారాం రెడ్డి, రఘు, నారాయణ పాల్గొన్నారు.

మక్తల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో బాణసంచా కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. అంతకుముందు మక్తల్ పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీహరి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు మంచి ఫలితాలు వచ్చాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐ పోలీస్ చంద్రశేకర్‌రెడ్డి , నర్సిములు, గణేష్, రవికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, శరణప్ప, వివేక్, ఫయాజ్, సూర్య కుమార్, చెన్నయ్యసాగర్, రాజేందర్, నజీర్, కురుమన్న ఉన్నారు.

కోస్గి పట్టణంలోని రామాలయం చౌరస్తా నుంచి శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాలమూర్–తాండూర్ ప్రధాన రహదారిపై టపాసులు కాలుస్తూ, మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకున్నారు. టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్దన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, కౌన్సిలర్లు గోవర్దన్ రెడ్డి, భాను నాయక్, ఇద్రీస్, నాయకులు ఆసీఫ్, సలీం, గిరి ప్రసాద్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, టెంట్ నర్సింహా, బర్రె వెంకట్, కేపీ, విద్యాసాగర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊట్కూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, లింగం, కొక్కు శంకర్, అశోక్, తాడ్‌పత్రి మహ్మద్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించి, మిఠాయిలు పంచారు.

మరికల్: మండల పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాగాంధీ చౌరస్తాలో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రఘు, హరీశ్, వీరన్న, కృష్ణయ్య, రామకృష్ణ, అంజిరెడ్డి, మొగులప్ప, శేఖర్, సత్యన్న, ఆంజనేయులు, రఘు, చెన్నయ్య, నాగరాజ్ పాల్గొన్నారు.

మాగనూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు.

నర్వ అంబేద్కర్ చౌరస్తాలో, ఉందేకోడ్ గ్రామంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు బాణసంచా కాల్చారు. పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శరణప్ప, వివేక్‌వర్ధన్‌రెడ్డి, నీరజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, అయ్యపురెడ్డి, బీసం రవికుమార్, మహేష్, సంజీవరెడ్డి ఉన్నారు.

కృష్ణా మండలంలోని ఆలంపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. సిద్దప్పగౌడ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు శంక్రప్ప, గౌరప్ప, మారెప్ప, సురేష్ పాల్గొన్నారు.



కోస్గిలో..



మక్తల్‌లో..

టీఎస్‌పీఎస్సీ పరీక్షల నిర్వహణ అధికారిగా జగదీశ్వర్‌రెడ్డి



ఆత్మకూర్: టీఎస్‌పీఎస్సీ పరీక్షల నిర్వహణ అధికారిగా మండలంలోని తిప్పడంపల్లికి చెందిన జగదీశ్వర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. గ్రామానికి చెందిన దివంగత వెంకట్‌రెడ్డి, సరోజనమ్మ దంపతులకు 4వ కుమారుడైన ఈయన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు అభ్యసించారు. ఇంటర్ ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, డిగ్రీ నారాయణపేటలో, ఎంసీజే హైదరాబాద్‌లో చేశారు. అనంతరం గ్రూప్స్ ద్వారా డీటీ, తహసీల్దార్ పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. డీఆర్‌డీఓ, నల్లగొండ ఆర్డీఓగా, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల ఓఎస్‌డీగా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈయనను టీఎస్‌పీఎస్సీ పరీక్షల నిర్వహణ అధికారిగా నియమించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మరమ్మతులకు శ్రీకారం

మదనాపురం: మండలంలోని మార్కెట్ యార్డులో రైతు విశ్రాంత భవనం మరమ్మతు పనులకు శనివారం చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మార్కెట్ నిధుల నుంచి రూ.4లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్, సర్పంచ్ రామనారాయణ, నాగన్నయాదవ్, చాంద్ పాషా, బాలు, సత్యంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.